# వల

ఆఫీసు నుంచి బయటపడి, యింటి దారి పట్టాను. ఎండలు మండిపోతున్నాయి. గోల్ మార్కెట్ దగ్గరకు వచ్చేసరికి - గొంతుక తడి ఆరిపోయింది. క్వాలిటీ కౌంటర్‌లో, 'ఫాంటా' ఆరంజి తాగి, రూపాయి నోటిచ్చాను.

"చిల్లర లేదు సాబ్! పావలా తర్వాత తీసుకోండి!" అన్నాడు షాపతను నవ్వుతూ.

మూడో రోజు సాయంత్రం - నేనూ, భల్లా గోల్ మార్కెట్ సెంటర్లో మాట్లాడు కొంటున్నాం.

"దాహమేస్తోంది రావ్. పద, డ్రింకులు తాగుదాం" అన్నాడు భల్లా. క్వాలిటీ కౌంటర్లో, రెండు 'కోకాకోలా'లు తీసుకొన్నాం.

భల్లా డబ్బులివ్వబోతూంటే, "నువ్వాగు, యితను నాకు డబ్బులివ్వాలి" అంటూ - రెండు రూపాయి కాగితాలు తీసి షాపతనికి యిచ్చాను.

"మొన్న నాకు పావలా యివ్వాలి నువ్వు. రూపాయి పావలా తీసుకొని, ముప్పావలా తిరిగి యివ్వు" అన్నాను సీరియస్‌గా

నా చేతిలో ఒక రూపాయి నోటు తిరిగి పెడ్తూ, "చిల్లర లేదు సాబ్! పావలా మీరే తర్వాత యివ్వండి" అన్నాడు నవ్వుతూ.

ఓ మూడు రోజులు గడిచిపోయాయి. అతనికివ్వవలసిన పావలా సంగతి మర్చి పోయాను. నాలుగో రోజు నేనూ, మా రెండోవాడు, మార్కెట్‌కి వెళ్ళాం. వాడు టాఫీల కోసం మారాం చేశాడు. క్వాలిటీ కౌంటర్ పక్కనున్న పాన్‌షాపులో పావలా టాఫీలు తీసుకొని, రూపాయి నోటిచ్చాను.

"చిల్లర యివ్వండి సార్" అన్నాడు కొట్టతను, రూపాయి నోటును నా వైపు నెట్టుతూ. అప్పటికే మా కుర్రవెధవ రెండు టాఫీలు మింగేశాడు. క్వాలిటీ అతనికివ్వాల్సిన పావలా సంగతి జ్ఞాపకానికొచ్చింది. అతనికి రూపాయి నోటిస్తూ, "మొన్న నీకు పావలా యివ్వాలి తీసుకొని మిగిలిన డబ్బులివ్వు" అన్నాను.

"దాహమేస్తోంది నాన్నా, నాకు 'రిమ్‌జిమ్' కావాలి" అన్నాడు మా కుర్రవెధవ. వాడిది వాళ్ళమ్మలాగే మంకుపట్టు. అక్కడ రాద్ధాంతం జరగడం నాకిష్టం లేదు. 'సరే' అన్నట్లుగా చూశాను. మరుక్షణంలో మావాడి చేతికి పైనాపిల్ సీసా వచ్చింది.

"పక్క కొట్టతనికి పావలా యివ్వాలి కదా అని, నీ దగ్గరకొచ్చాను. ఇప్పుడు రూపాయి సరిపోయింది! ఎలా?" అన్నాను.

"దానికేముంది సార్! పావలా నేనిస్తాను. మీ దగ్గర చిల్లరున్నప్పుడిద్దురుగాని!" అంటూ - కాష్ బాక్స్ తీసి, పావలా కాసిచ్చాడు. వెంటనే నేను జేబులోంచి మరో రూపాయి నోటు తీసి అతనికిస్తూ, "నాకో 'లిమ్కా' కావాలి" అన్నాను.

అతనిచ్చిన లెమన్ తాగి, పక్క కొట్టతనికి పావలా యిచ్చేసి, మా కుర్రాడి జబ్బ పట్టుకొని యింటి దారి పట్టాను - క్వాలిటీ షాపతని వల నుండి తప్పించుకొన్నాన్న సంతృప్తితో.

*('యువ' మాసపత్రిక: ఆగస్టు 1972)*